

మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

## 9న 'గ్రూప్-1 ప్రిలిమినరీ

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్
- పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్ష

పెద్దపల్లి, మే22: వచ్చే నెల 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆదేశించారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జాం ఏర్పాట్లపై బుధవారం ఆయన సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 9న ఉదయం 10: 30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రూప్-1 ప్రిలిమినరీ జరుగుతుందని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు దృష్ట్యా ఉదయం 9నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని, 10గంటల తర్వాత అనుమతి ఉండదని స్పష్టం చేశారు. జిల్లాలో 6,098మంది అభ్యర్థుల కోసం 14పరీక్షా కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. పోలీస్ బందోబస్తుతో ప్రశ్నాపత్రాలను కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రతి అభ్యర్థిని పూర్తి స్థాయిలో చెక్ చేయాలని సూచించారు. అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి సైతం పరీక్షా కేంద్రం ప్రాంగణంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. సమావేశంలో పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు బీ గంగయ్య, హనుమా నాయక్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, డీఈవో డీ మాధవి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, సీ సెక్షన్ పర్యవేక్షకుడు ప్రకాశ్, చీఫ్ సూపరింటెండెంట్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన రైతులు, ప్రొఫెసర్లు

## సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

**అసోసియేట్ డీన్ భారతినారాయణ్ భట్**

జగిత్యాల టౌన్, మే 22: పంటల సాగులో జీవన, సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడి వస్తుందని పొలాస ప్రాంతీయ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతినారాయణ్ భట్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో బుధవారం షెడ్యూల్డ్ కులాల రైతులకు పంటల సాగులో జీవన, సేంద్రియ ఎరువుల వాడకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీన్ భారతినారాయణ్ భట్ మాట్లాడుతూ, రసాయన ఎరువులు వాడితే భూసారం దెబ్బతిని పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్ సుష్మాదేవి మాట్లాడుతూ, జీవన, సేంద్రియ ఎరువుల వాడకంలో మెళకువలు, తయారీ విధానం, వాడే మోతాదు గురించి వివరించారు. షెడ్యూల్డ్ కులాల సెల్ అధికారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, భూమిలో పోషకాల విలువలను తెలుసుకునేందుకు మట్టి నమూనా పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోండి





మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, పాల్గొన్న అధికారులు

- వానకాలం నుంచి పునఃప్రారంభం
- రైతులకు పూర్తి ఉచితం
- ఏఈవోలు బాధ్యతగా పని చేయాలి
- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 22 (నమస్తే తెలంగాణ) : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతులకు పూర్తిగా ఉచితంగా అమలు చేస్తున్నట్లు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈ పథకం కింద బీమా ప్రీమియం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్‌లోని కేడీసీసీబీ సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి జిల్లా వ్యవసాయ, ఉద్యాన, ప్రణాళికా అధికారులు, ఏవోలు, ఏఈవోలు, రైతులతో ఫసల్ బీమాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఫసల్ బీమా పథకం 2016లో ప్రారంభించారని, 2019 యాసంగి వరకు కొనసాగిందని, తిరిగి 2024 వానకాలం నుంచి ఈ పథకాన్ని పునః ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్కువగా చిన్న సన్నకారు రైతులే ఎక్కువగా ఉంటారని, ఫసల్ బీమా పథకంలో గ్రామాన్ని బీమా యూనిట్‌గా పరిగణిస్తారన్నారు. క్లస్టర్ అప్రోచ్ ద్వారా ఎక్కువ మంది రైతులు లాభపడే అవకాశం ఉంటుందని చెప్పారు. వ్యవసాయ విస్తరణ అధికారులు చాలా జాగ్రత్తగా క్రాప్ బుకింగ్ చేయాలని, పంట కోత ప్రయోగాలు జాగ్రత్తగా నిర్వహిస్తే రైతులు లాభపడతారని, ఏఈవోలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి పర్యవేక్షణాధికారిగా వచ్చేసిన జేడీఏ బాలు నాయక్ ఫసల్ బీమా గురించి వివరించారు. పంట దిగుబడిని ఆధారంగా చేసుకుని బీమా నిర్ణయించబడుతుందని, వాతావరణ ఆధారిత బీమా పథకం అయినందున వాతావరణ పరిస్థితుల ఆదారంగా బీమా నిర్ణయిస్తారని వివరించారు. ఆ తర్వాత పథకం మాస్టర్ ట్రైనర్స్ మమత, ప్రతిభ, భూమిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సదస్సులో కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరెడ్డి, ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు బీ శ్రీనివాస్ (కరీంనగర్, డీ ఆదిరెడ్డి (పెద్దపల్లి), వీ భాస్కర్ (సిరిసిల్ల), బీ వాణి (జగిత్యాల), ఉద్యాన అధికారులు బీ శ్రీనివాస్, ఎం జ్యోతి, జే ప్రతాప్ సింగ్, సీ జగన్‌మోహన్ రెడ్డి, సీపీవోలు డీ కొమురయ్య, పీబీ శ్రీనివాస్, వీ పూర్ణచందర్ రావు, షబానా సుల్తానా, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో వ్యాన్ బీభత్సం

జగిత్యాల, కలెక్టరేట్ మే 22: జగిత్యాల తులసీ నగర్‌లో బుధవారం ఓ వ్యాన్ బీభత్సం సృష్టించింది. ఇంటి ముందు నిల్చున్న వ్యక్తిని ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని తులసీ నగర్‌కు చెందిన తండ్రీకొడుకులైన పల్లకొండ రాజయ్య, రాజేందర్, ఇంటి పక్కనే ఉండే పోచయ్య ముగ్గురూ కలిసి వారి ఇంటి ముందు రోడ్డుపై నిల్చొని కుటుంబ విషయాలు మాట్లాడుకుంటున్నారు. అంతలోనే ఓ మారుతీ వ్యాన్ అతివేగంగా దూసుకువచ్చి రాజయ్యను ఢీకొట్టింది. దీంతో రాజయ్య రోడ్డుపై ఎగిరిపడ్డాడు. చికిత్స కోసం జగిత్యాల ప్రధాన దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందాడు. పోచయ్య స్వల్ప గాయాలతో బయటపడగా, రాజేందర్‌కు ఏం కాలేదు. వీరిని ఢీకొట్టిన వ్యాన్, అక్కడే ఉన్న ఓ బైక్‌ను సైతం ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిపోయింది. రాజయ్య కొడుకు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



ఖేలో ఇండియా కోకో బృందంతో డీఐఎస్ఓ సురేష్

## సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా ఖోఖో సెంటర్

సుల్తానాబాద్ మే 22: 'ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీ య స్థాయి తీర్చిదిద్దేందుకు దేశంలోనే తొలిసారిగా సుల్తానాబాద్‌లో ఖోఖో సెంటర్‌ను ఏర్పాటు చేశాం. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి' అని డీవైఎస్‌వో సురేష్ కుమార్ సూచించారు. సుల్తానాబాద్ మినీ స్టేడియంలో ఖోఖో సెంటర్‌ను బుధవారం సందర్శించారు. ఖేలో ఇండియా కింద పెద్దపల్లి జిల్లాకు కోకో సెంటర్ మంజూరు కావడం గర్వంగా ఉందన్నారు. అందరూ క్రమశిక్షణగా క్రీడా నైపుణ్యాన్ని అలవరుచుకొని దేశం గర్వపడేలా మన జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శంకరయ్య, సెంటర్ కోచ్ గెల్లు మధుకర్ యాదవ్, పీఈటీలు ప్రణయ్ ఇక్బాల్ పాల్గొన్నారు.

## అర్బన్ బ్యాంకు ఎన్నికల షెడ్యూల్ విడుదల

- జూన్ 6న ఎన్నికలు
- ఈ నెల 27న నామినేషన్ల స్వీకరణ

రాజన్న సిరిసిల్ల, మే 22 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికల షెడ్యూల్‌ను బుధవారం రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ విడుదల చేసింది. అర్బన్ బ్యాంకు పాలకవర్గం 12 స్థానాలకు నిర్వహించే ఎన్నికల తేదీని ప్రకటించింది. ఈ మేరకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఎన్నికల అధికారి రామకృష్ణ వివరాలు వెల్లడించారు. బ్యాంకులో మొత్తం 6177 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 27, 28 తేదీలలో నామినేషన్లు స్వీకరిస్తారు. 30న పరిశీలన, 31న ఉదయం 11గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఉపసంహారణకు గడువు ఇచ్చి, తదుపరి అర్హులైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. వచ్చే నెల 5న నామినేషన్ల ఉపసంహారణ, 6న సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటల దాకా పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ప్రకటిస్తారు.

## రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మే 22 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా మే 24న ప్రారంభమయ్యే పరీక్షలు 31తో ముగియనున్నాయి. ఇందులో ఉదయం 9 గంటల నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరంలో 10,073 మంది, ద్వితీయ సంవత్సరంలో 4,907 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒక మైనార్టీ జూనియర్ కళాశాల, 23 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షకు హాజరయ్యే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. పరీక్షలకు డీఈసీ సభ్యులుగా కే రవీందర్, కేదారేశ్వర్ ఉంటారని తెలిపారు.



రషీద్, ఖైరొద్దీన్ (ఫైల్)

## అదుపు తప్పి.. చెట్టును ఢీకొట్టి..

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు
- చికిత్సపొందుతూ దవాఖానలో ఇద్దరూ మృతి

మేడిపల్లి, మే 22: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న దుర్ఘటనలో తండ్రీకొడుకులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన రషీద్(60) కరీంనగర్‌లో ఉన్న తన తండ్రి ఖైరొద్దీన్(85) వద్దకు వెళ్లాడు. తిరిగి తన తండ్రితో కలిసి కారులో మెట్‌పల్లికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మేడిపల్లి మండల శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద కారు అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులు ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందారు. రషీద్ బంధువు నస్రీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రవీందర్‌రావు తెలిపారు. ఘటనస్థలాన్ని మెట్‌పల్లి సీఐ ప్రవీణ్, కథలాపూర్ ఎస్ఐ నవీన్‌కుమార్ పరిశీలించారు.

## నేడు ఉమ్మడి జిల్లా టీ20 జట్టు ఎంపికలు

కొత్తపల్లి, మే 22 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీ20 టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీ ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీలు నగరంలోని సెయింట్ ఆల్ఫోన్స్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఎస్ఎస్‌సీ మెమో, బోనఫైడ్, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సొంత కిట్, పూర్తి యూనిఫాంతో పోటీలకు హాజరుకావాలని పేర్కొన్నారు. క్రీడాకారులు 16 సంవత్సరాలు పూర్తి చేసుకొని 28 సంవత్సరాల వయస్సులోపు వయసు ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు 8688768775 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.


